క్లుప్తంగా

శివాలయంలో ప్రత్యేక పూజలు

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాస సోమవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామికి అర్చకులు ఫణికుమార్‌శర్మ అభిషేకాలు నిర్వహించారు. శివాలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి.

నిబంధనలకు లోబడి ఆటోలు నడపాలి

పీలేరు రూరల్ : నిబంధనలకు లోబడి ఆటోలు నడపాలని సీఐ యుగంధర్ అన్నారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆటో డ్రయివర్లు, స్కూల్ బస్సు డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. పీలేరులో ఆటోల సంఖ్య ఎక్కువగా ఉందని డ్రైవర్లు నిబంధనలకు లోబడి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఆటోలు నడపాలన్నారు. మద్యంసేవించి, సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకుని సురక్షితంగా గమ్యాన్ని చేర్చాలన్నారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బంది, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేలమల్లేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

నిమ్మనపల్లె : మండలం లోని తవళం నేలమల్లేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు సోమవారం దేవదాయ శాఖ లోకల్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్ కుమార్‌రెడ్డి, ఆలయ ఈఓ మంజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలల కాలానికి నేలమల్లేశ్వర స్వామి ఆలయ హుండీ ద్వారా రూ.36,546 ఆదాయం వచ్చిందన్నారు. ఈ నగదు మొత్తాన్ని ఇండియన్ బ్యాంక్ వాల్మీకిపురంలో జమచేసి, ఆలయ అభివృద్ధికి ఉపయోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.రెడ్డప్ప, రాజన్న, మేష రామకృష్ణ, ఆలయ అర్చకులు శంకర స్వామి, గోపాలకృష్ణ, సిబ్బంది మహేష్ పాల్గొన్నారు.

వాల్మీకిపురం ఎస్ఐ- 2గా శ్రీహరి



వాల్మీకిపురం: వాల్మీకిపురం ఎస్ఐ- 2గా శ్రీహరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న క్రిష్ణమూర్తి మదనపల్లి టూటౌన్‌కు బదిలీ కాగా రాయచోటిలో పని చేస్తున్న శ్రీహరి వాల్మీకిపురంకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. దొంగతనాలు, దోపిడీలు జరగకుండా చర్యలు చేపడతామన్నారు.

ర్యాగింగ్ జోలికెళితే జైలు పాలే

కురబలకోట: ర్యాగింగ్ జోలికెళ్లి జైలు పాలు కావొద్దని అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ హెచ్చరించారు. యాంటి ర్యాగింగ్ డేని పురస్కరించుకుని సోమవారం మిట్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాలల్లో ర్యాగింగ్‌పై చట్టాలు పదునుగా ఉన్నాయన్నారు. యూజీసీ, ఏఐసీటీఈ లాంటి సంస్థలు రెగ్యులేషన్స్ తీసుకు వచ్చాయన్నారు. మరో వైపు పోలీసు చట్టాలు కఠినతరంగా ఉన్నాయన్నారు. వాటిని పాటించకపోతే శిక్షార్హులవుతారన్నారు. అత్యుత్సాహానికి పోయి జైలు పాలు కావద్దన్నారు.

వాల్మీకిపురం ఎంపీడీఓగా మనోహరరాజు



వాల్మీకిపురం: వాల్మీకిపురం ఎంపీడీఓగా మనోహర రాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సుధాకర్‌రెడ్డి రామసముద్రంకు బదిలీ కాగా ఎన్నికల విధుల అనంతరం నెల్లూరు జిల్లాలో పని చేస్తున్న మనోహర రాజు తిరిగి వాల్మీకిపురంకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

నిమ్మనపల్లె ఎంపీడీఓగా రమేష్ బాబు



నిమ్మనపల్లె : నిమ్మనపల్లె నూతన ఎంపీడీఓగా రమేష్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న కె.షాలెట్ నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న రమేష్ బాబుకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

పీటీఎం ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



పెద్దతిప్పసముద్రం: మండల ఎంపీడీఓగా కేఎస్ బాలాజీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పలమనేరు మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. అందరి సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

మేము సైతం.. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో..

- జై భారత్... భారత్ మాతాకీ జై
- నినాదాలతో దద్దరిల్లిన మదనపల్లె
- ముందస్తు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భారీ ర్యాలీ
- వేలసంఖ్యలో హాజరైన విద్యార్థులు



త్రివర్ణ పతాక రంగుల దుస్తులతో విద్యార్థుల ర్యాలీ





స్వాతంత్ర్యసమరయోధుల ఫొటోలు, జెండాలను ప్రదర్శన, ఆర్టీసీ బస్టాండులో విద్యార్థుల ర్యాలీ

మదనపల్లె : జై భారత్, భారత్ మాతాకీ జై నినాదాలతో మదనపల్లె మురిసిపోయింది. త్రివర్ణ పతాకాలను చేతపట్టుకుని, స్వాతంత్య్ర సమరయోధుల ఫొటోలను ప్రదర్శిస్తూ పట్టణ పురవీధుల గుండా సాగిన భారీ ర్యాలీ పట్టణ ప్రజలను ఆకట్టుకుంది. ముందస్తు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మూడురోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నిర్ణయించారు. అందులో భాగంగా మొదటిరోజైన సోమవారం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల విద్యార్థులతో భారీ ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన వేలాదిమంది విద్యార్థులతో కలిసి జాతీయ జెండాను చేతపట్టుకుని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముందుకుసాగారు. జెడ్పీ హైస్కూల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, సీటీఎంరోడ్డు, టౌన్‌బ్యాంక్ సర్కిల్, అవెన్యూరోడ్డు, బెంగళూరు బస్టాండ్, శ్రీకృష్ణదేవరాయసర్కిల్ మీదుగా అనిబిసెంట్ సర్కిల్‌కు చేరుకున్నారు. అనిబిసెంట్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి బయలుదేరి జెడ్పీ హైస్కూల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్ర పోరాటంలో మదనపల్లెకు ప్రత్యేక స్థానం ఉన్న నేపథ్యంలో... దేశభక్తిని, స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని నేటి తరాలకు తెలపాలనే ఉద్దేశంతో మూడురోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం పాఠశాల విద్యార్థులతో మెగా ర్యాలీ, బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. వీటన్నింటికీ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాలీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ర్యాలీ సందర్భంగా డీఎస్పీ కొండయ్యనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ ఖాజాబీ, ఆర్ఐ రెడ్డెప్ప, జ్ఞానాంబిక కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్, జునైద్ అక్బరీ, పోర్డ్ లలితమ్మ, దారంఅనిత, పులి మహాలక్ష్మి, రాధ, షోయబ్‌షేను పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన కరెంటు

ట్రాన్స్‌కో డీఈ చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో డీఈ చంద్రశేఖర్‌రెడ్డి

గుర్రంకొండ: రైతులకు నాణ్యమైన కరెంటు సరఫరా ఇవ్వాలని పీలేరు ట్రాన్స్‌కో డీఈ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్‌సీజన్లో పంటలసాగును ఇప్పటికే రైతులు ప్రారంభించారన్నారు. వ్యవసాయపొలాల వద్ద విద్యుత్ లైన్లకు చెట్ల కొమ్మలు అంతరాయం కలిగిస్తుంటే వెంటనే తొలగించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. పొలాల్లో కిందికి వేలాడుతున్న కరెంటు తీగెలను సరిచేయాలన్నారు. వర్షాకాలంలో వీటివలన ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకొన్నా, ఎక్కడైనా పొలాల్లోకి ఒరిగిపోయి ఉన్నా వెంటనే వాటిని తొలగించి సరి చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు కరెంటు సరఫరా ఇవ్వాలన్నారు. రైతుల నుంచి వచ్చే ఎలాంటి ఫిర్యాదులపైనా అయినా సరే వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. అనంతరం రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై సలహాలు, సూచనలను రైతుల వద్ద నుంచి స్వీకరించారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఏడీఏ శ్రీనివాసులు, ఏఈ మౌసిన్, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న బెల్లాల ఫౌండేషన్ సభ్యులు

పెద్దమండ్యం: మండలంలోని కలిచెర్ల తెలుగు ఉన్నత, ఉర్దూ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు సోమవారం హైదరాబాద్‌కు చెందిన బెల్లాల ఫౌండేషన్ వారు నోటు పుస్తకాలను వితరణగా ఇచ్చారు. రెండు ఉన్నత పాఠశాలల్లోని 750 మంది విద్యార్థులకు రూ. 3 లక్షల విలువ చేసే నోటు పుస్తకాలను పంపిణీ చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. కలిచెర్ల తెలుగు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కె రామచంద్ర అధ్యక్షతన నోటు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పౌండేషన్ సభ్యులు సాయినాందేవ్‌బెల్లాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు పోవాలన్నారు. పాఠశాలలో ఆట స్థలం అభివృద్ధి కోసం తనవంతు సహాయాన్ని అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో బెల్లాల ఫౌండేషన్ వారి కుటుంబ సభ్యులు విజయభారతి, మీనా, దివ్య, మదనపల్లె ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఓంప్రకాష్, రాజేష్, మల్లికార్జున, ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజర్ మంగపతి, ఎంఈఓ మనోహర, సర్పంచ్ జింకా విశ్వనాథ, మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, మాజీ సర్పంచ్ విజయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి లేని సమాజమే లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

గుర్రంకొండ: క్షయవ్యాధి(టీబీ) లేని సమాజ లక్ష్య సాధన కోసం వయోజన బీసీజీ టీకాలను భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లా ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్‌రఫీ, వాల్మీకీపురం టీబీ యూనిట్ పర్యవేక్షులు నాగిరెడ్డి తెలిపారు. మండలంలోని తరిగొండ గ్రామంలో సోమవారం బీసీజీ టీకాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం టీకాలను ప్రవేశపెట్టిందన్నారు. వయోజనా బీసీజీ టీకాలు మరణాల తీవ్రతను నివారించడానికి కృషి చేస్తాయన్నారు. టీబీకి వ్యతిరేకంగా మనిషిలో రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి ఈ అవగాహన సదస్సులో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. బీసీజీ టీకాలు ఎటువంటి అనుమానాలకు తావులేకుండా వేసుకోవచ్చన్నారు. 60 సంవత్సరాలు వయస్సు పైబడ్డవారు, పొగపీల్చువారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, టీబీ జబ్బుతో కోలుకొన్నవారు, వారికుటుంబ సభ్యులు టీకాలు వేసుకోవడానికి అర్హులన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని టీబీ వ్యాధిని తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎమ్ సురేఖ, ఆశావర్కర్లు, మతపెద్దలు అబ్దుల్ జావీద్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

నిమ్మనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని వెంగంవారిపల్లెలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు చెప్పారు. వెంగంవారి పల్లి సమీపన చింత చెట్టు కింద స్థానికుడైన కృష్ణప్ప(45) సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు చెప్పారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నాగరాజు

తంబళ్లపల్లె: మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పంచాయతీల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి డీఎల్‌పీఓ నాగరాజు సూచిపంచారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. రీసోర్సు పర్సన్లు రాజశేఖర్ పారిశుధ్యం, వీధిదీపాలు, అభివృద్ధి ప్రణాళిక, ఆదాయం వనరులను గుర్తించి సద్వినియోగం చేసుకోవడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వర్కర్లపై వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ ధర్నా



బి.కొత్తకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నాయకుల ధర్నా

బి.కొత్తకోట: మా పార్టీ అధికారంలోకి వచ్చింది, ఇప్పటిదాక మీరు ఉద్యోగాలు చేశారు. ఇప్పుడు మా వాళ్ళు ఉద్యోగాలు చేస్తారని కొన్ని చోట్ల అధికార పార్టీ నేతలు చిరుద్యోగులపై వేధింపులకు గురిచేస్తున్నారని నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ నేతలు, కార్మికులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ పథకాల్లో పని చేస్తున్న వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, అక్రమంగా తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ తంబళ్లపల్లి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సలీంబాషా, వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన వంట కార్మికులు, స్కూల్ స్వీపర్లు తదితర కార్మికులపై గ్రామాలలో అధికార పార్టీ నేతలు వేధింపులకు పాల్పడుతూ అక్రమంగా తొలగిస్తున్నారని అన్నారు. కక్ష సాధింపు చర్యలు, దౌర్జన్యాలు ఉండవని సీఎం చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించినా వేధింపులు ఆగడం లేదన్నారు. దీనిపై సీఎం అధికారులకు ఆదేశాలు పంపాలని డిమాండ్ చేశారు. తమ వాళ్లే ఉద్యోగాల్లో ఉంటారని నాయకులు వాదిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కే.బాలకృష్ణ, లక్ష్మన్న అలివేలమ్మ లక్ష్మీదేవి శాంతమ్మ, బేబీ, బిబిజాన్, జయమ్మ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరు ఆలయానికి కూరగాయలు వితరణ



కూరగాయల వాహనం పంపుతున్న భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు

మదనపల్లె సిటీ: టీడీడీకి చెందిన తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి మదనపల్లెకు చెందిన భ్రమరాంబిక సేవా సమితి, కెజీఎస్ కూరగాయల మండీ సంయుక్తంగా కూరగాయాలు వితరణగా పంపారు. స్థానిక వారపుసంతలో ప్రత్యేక వాహనంలో 11 టన్నుల వివిధ రకాల కూరగాయలను అమ్మవారి ప్రసాదాల కోసం పంపించారు. కార్యక్రమంలో భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు నాగమణి, లతా, అనసూయమ్మ, కేజీఎస్ మండీ నిర్వాహకులు దాదాపీర్,ఖాజీపీర్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతా భావాన్ని పెంపొందించుకోవాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

పీలేరురూరల్ : ఐక్యతా భావాన్ని పెంపొందించుకోవాలని ప్రభుత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మూడు రంగుల జెండా (హర్ ఘర్ తిరంగా) కార్యక్రమంలో భాగంగా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగాప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజలందరినీ ఏకం చేసి ఐక్యత భావాన్ని పెంపొందించడంలో మన త్రివర్ణ పతాకానిది కీలక స్థానమని తెలిపారు. మనమంతా భారతీయులం, మనమంతా ఒక్కటే అనే భావాన్ని ప్రకటించడానికి ప్రతి కుటుంబం తమ ఇంటిపై సగర్వంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి రూ. 19.85 లక్షల ఆదాయం

పీలేరు రూరల్ : పీలేరు గ్రామ పంచాయతీకి వారపు సంత, గడుల వేలం ద్వారా రూ. 19,85,700 ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ జీనత్, ఈవీపీఆర్‌డీ జయమ్మ తెలిపారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు నెలల కాలానికి వేలం వేయగా 30 రూములకు నెలకు రూ.1,34,100 చొప్పున ఏడు నెలలకు రూ. 9,38,700 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వారపు సంత గేటు వసూలుకు రూ. 10,47,000 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవో గురుమోహన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షఫీ తదతరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ఏఐటీయూసీలో చేరిన అంగన్‌వాడీ కార్యకర్తలతో యూనియన్ నాయకులు

కేవీపల్లె : అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏఐటీయూసీ అనుబంధ యూనియన్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి అన్నారు. సోమవారం కేవీపల్లె సెక్టార్ పరిధిలో 30 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు ఏఐటీయూసీ అనుబంధ యూనియన్ హెల్పర్స్ అసోసియేషన్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సమ్మె కాలపు హామీలు అమలు పరచాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు, సెంటర్ అద్దెలు చెల్లించాలని డిమాండ్ చేశారు. టీఏ, డీఏ బకాయిలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు, అంగన్‌వాడీలు సుహాసిని, రూప. శ్రీదేవి, ప్రేమ, సీత, రమణమ్మ, పద్మజ, రంజిత, మీన, కుమారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల నిరసన

ములకలచెరువు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు సోమవారం ఎర్ర జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఫైళ్ళ కాలిపోవడానికి కారకులైన నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ నాయకులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి

వాల్మీకిపురం: విధుల విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వాల్మీకిపురం ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటుగా జరిగే శిక్షణ కార్యక్రమాల్లో గ్రామీణ సమస్యల పరిష్కారం, అభివృద్ధి ప్రణాళికలు తదితర అన్ని కూడా తెలియజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ షబ్బీర్ అహ్మద్, ఈవో ఉదయ్ కుమార్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాసిరకం నిర్మాణాలపై ఎమ్మెల్యే అసంతృప్తి

- వర్షపు నీటితో నిండిన ఆస్పత్రి గదులు
- అవస్థలు పడ్డ రోగులు, సహాయకులు

మదనపల్లె : జిల్లా ఆస్పత్రిలో జరుగుతున్న నాసిరకం నిర్మాణాలపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థ అగ్రిమెంట్‌ను రద్దుచేయాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి జిల్లా ఆస్పత్రిలోని గదులు, వార్డుల్లో నీరు నిలిచిపోయి, రికార్డులు తడిసిపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికితోడు రోగులు పైకి వెళ్లేందుకు ర్యాంపు నిర్మాణంలో కాంట్రాక్ట్ సంస్థ నిర్లక్ష్యం కనపరచడంపై ఏపీఎంఐడీసీ ఈఈ అరవిందాదేవిని, డీఈ కరీముల్లాఖాన్‌పై సంజాయిషీ కోరారు. మేఘా ఇంజనీరింగ్ ఏజెన్సీని డిస్ క్వాలిఫై చేయాల్సిందిగా హెల్త్ మినిస్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను మరింత మెరుగుపరచాలన్నారు.

ముంపుప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

పట్టణంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని శేషప్పతోట, ప్రశాంత్‌నగర్, కృష్ణానగర్, ఎన్‌టీఆర్ సర్కిల్ తదితర ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. మోకాలిలోతుకు నీళ్లు నిలిచిపోయి, రోడ్లపై మురుగు ప్రవహించింది. దీంతో సోమవారం ఉదయం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మున్సిపల్ కమిషనర్ ప్రమీలతో కలిసి పర్యటించి సహాయకచర్యలు ముమ్మరం చేయాల్సిందిగా ఆదేశించారు.

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి



పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల చేత ప్రమాణం చేయిస్తున్న అధికారులు

గుర్రంకొండ: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని టీఓటీలు లతీఫ్‌ఖాన్, గఫార్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు తమ విధులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా తమ విధులను సక్రమంగా నిర్వహిస్తామంటూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల చేత ప్రమాణం చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాసమస్యలను అధికారులు, సర్పంచ్‌లు చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. పనుల మీద పంచాయతీ కార్యాలయాలకు వచ్చే ప్రజలను మర్యాదపూర్వకంగా పలకరించి వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. పన్నుల రూపేనా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధి కోసం ఖర్చు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రతి మూడునెలలకొకమారు పాలకవర్గ సమావేశాలు నిర్వహించాలన్నారు. పాలకవర్గం ఆమోదించిన పనులను మాత్రమే చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగశివారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ విశ్వనాథ్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వార్షికోత్సవం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామానాయుడు

మదనపల్లె సిటీ: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం స్థానిక బీటీకాలేజీ వద్ద ఘనంగా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి నరసింహులు జెండాను ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. సమశీల విద్యార్థి ఉద్యమాల నిర్మాణంలో తనదైన పాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి నిత్యం విద్యార్థులకు అండగా నిలుస్తోందన్నారు. ప్రగతిపథం వైపు నడిపించడానికి పోరాటాల మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. 88 సంవత్సరాలు పూర్తి చేసుకుని 89 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా విద్యార్థిమిత్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్లర్స్ కన్వీనర్ భవిత, కో కన్వీనర్ గంగారాణి, నాయకులు వినయ్, కమలాకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం: అఖిల భారత విద్యార్థి సమాఖ్య 89వ ఆవిర్భావ దినోత్సవ వార్షికోత్సవం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో సోనవారం నిర్వహించారు. మదనపల్లె నియోజకవర్గ ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు ఓబులేష్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షులు వినయ్, సహాయ కార్యదర్శి కమలాకర్, రామసముద్రం మండల అధ్యక్ష కార్యదర్శులు చరిత, ఇలాహి, ఉపాధ్యక్షులు నిరీష, శానుజ, నీతిశ్రీ, కుమారి, మణికంఠ, ఆదర్శ్, లాభాలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు లోపాలు సవరించాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె సిటీ: విద్యార్థుల సంఖ్యకు కనుగుణంగా ఉపాధ్యాయ సర్దుబాటులో లోపాలను సరిదిద్దాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ అన్నారు. సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డికి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో, జీతం తీసుకుంటున్న పాఠశాలనే ప్రాతిపదికగా తీసుకోవాలన్నారు. మున్సిపల్ మేనేజ్‌మెంట్‌లో సర్దుబాటు చేసిన తర్వాతనే మిగిలిన ఉపాధ్యాయులను ఇతర మేనేజ్‌మెంట్‌లో సర్దుబాటు చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలను హైస్కూల్లో విలీనమ్ చేయడం వలన ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికి వారిని మిగులు ఉపాధ్యాయులు చూపించారన్నారు. ఇలాంటి లోపాలను సర్దుబాటు చేయాలన్నారు. యూటీఎఫ్ నాయకులు సుధాకర్, మోహన్, ఖాదర్‌బాషా,పయని, ఖాజా పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల సూచనలు పరిగణలోకి తీసుకోవాలి

తంబళ్లపల్లె: పాఠశాల విద్య పని సర్దుబాటు ప్రక్రియలో ఉపాధ్యాయ సంఘాల సూచనలు పరిగణలోకి తీసుకోవాలని ఫ్యాక్టో నాయకులు రెడ్డప్పరెడ్డి, సాంబశివ, కుమారి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఫ్యాక్టో పిలుపు మేరకు వారు జి.ఓ 117, 118 ద్వారా కాకుండా 2020లో ఇచ్చిన జీఓ 53 మేరకు పని సర్దుబాటు కార్యక్రమం నిర్వహించాలన్నారు. సీనియర్‌కు విల్లింగ్ అవకాశం ఇవ్వాలన్నారు. మండల, డివిజన్‌స్థాయి వరకే పరిమితం చేసి మ్యాన్యువల్‌గా నిర్వహించాలన్నారు. 70 శాతం అంగవైకల్యం కలిగిన వారికి మినహాయింపు ఇవ్వాలన్నారు. స్టడీ,మెటర్నటీ వంటి దీర్ఘకాలిక సెలవులో ఉన్న టీచర్లు ఉన్న చోట మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ విషయమై ఎంఈఓ త్యాగరాజు, నాగసుబ్బరాయుడులకు వినతిపత్రం అందజేశారు.